# వాన



వై.రాంబాబు శాయి

నాగులపాడు శివారులో నాగమ్మ గుడిసెఉంది. ఆ గుడిసెలో బ్రతుకుతున్నది రెండుప్రాణులు మాత్రం — నాగమ్మ, నాగమ్మ కడుపున పుట్టిన ఏడాదినిండని కొడుకు. ఆర్నెల్ల క్రితం అదే గుడిసెలో మరో ప్రాణికూడా ఉండేది. కాని, అది అకస్మాత్తుగా తనువు చాలించుకుని కొండెక్కింది. అప్పణ్నించీ ఆ గుడిసెకు మగదక్షత లేకపోయింది.

నుదుట బొట్టులేని నాగమ్మ, మచ్చుకు తెల్లమబ్బుతునకైనా లేని ఆకాశం వేపు దృష్టినిలిపి నిలబడింది. లోతుకుపోయిన కళ్ళలో ఆశ చావలేదు. మినుకు మినుకుమంటూ ఉంది. రేపోమాపో ఆకాశకాంత పురుటి నొప్పులుపడి, వర్షించకపోదని ఆమె ఆశ. ఆరు నెలలుగా ఆ నేలమీద నీటి చుక్క పడలేదు. ఎండి బీటలుపడిన ఆ నేలతల్లి నాగమ్మవేపు బిక్కు బిక్కుమంటూ చూచింది. నాగమ్మ గుండె కరిగిపోయినటైంది. జాలిగా, కళ్ల

మూసుకుంది. కళ్ళల్లోకి చివ్వుమంటూ కన్నీరు రాలేదు. ఒక్క చుక్కకూడా రాలేదు. ఒంట్లో తడి యిగిరిపోయింది. వో స్తే కళ్ళవెంబడి రక్తమే రావాలి. నాగమ్మ ఒంట్లో రక్తమూ లేదు. ఎముకలు వెళ్లుకువచ్చిన ఆ శరీరంలో వట్టి చర్మంమాత్రమే మిగిలింది.

మబ్బు తునకైనా లేని ఆకాశాన్ని రోజూ చూస్తూనే ఉంది నాగమ్మ. రేపోమాపో వాన పడుతుందిలే అనుకుంటున్నది. రోజులు గడచిపోతున్నాయిగాని, వానమాత్రం రావడం లేదు

నాగమ్మ నిలబడలేక పోయింది. తడబడుతూ గుడిసెలోపలికి నడిచింది. గుంజ నానుకుని కూలబడింది. పిడచకట్టుకుపోయిన నాలికని చప్పరించుకుని, గుడిసెపైకి చూచింది. అక్కడ్నించి ఆమె చూపులు, గుంజకావల, కుక్కిమంచంలో చచ్చిన మాదిరి పడిఉన్న పసిబిడ్డ పైకి మళ్లాయి. తల్లి మనసు తడబడింది. ఒక్కపెట్టున పైకిలేచి, బిడ్డని గుండెలకు హత్తుకోవాలనుకుంది. నీరసంతో ఆమెలేచి నిలబడలేక, అక్కడే కూర్చుండిపోయింది.

పాలకోసం ఏడిచి ఏడిచి పసిబిడ్డ మరి ఏడవలేక మగతగా పడిఉన్నాడు. కన్నబిడ్డ కడుపునిండా పాలిచ్చేందుకు నాగమ్మ ఒంట్లో రక్తంలేదు. కనీసం గొంతుతడి చేసికొన్నేందుకైనా నీళ్లు దొరక్క అల్లాడిపోతున్న ప్రాణిలో పసిబిడ్డ ఆకలిని తీర్చగల పాలు లేకపోడం ఆశ్చర్యంకాదు. అది తల్లి తప్పు కాదు. బిడ్డ దురదృష్టం...ఆకలితో అల్లాడిపోతూ బిడ్డ గుక్కపట్టి ఏడుస్తూ ఉంటే, నాగమ్మ బిడ్డను సముదాయించ లేకపోయిసిది. కళ్ళు మూసుకుని, రెండు చేతులూ ఎత్తి, ఆకాశం మీద కూచున్న అఖిలేశునికి దండం పెట్టింది.

అంతకన్న నాగమ్మ మరి ఏం చేయగలదు! కడచిన సంవత్సరమంతా చుక్కైనా పడక, నేలమీది వర్చదనం పండబారి, నేలతల్లి గుండె వ్రక్కలైంది. ఫలితంగా పంటలేదు. తాగేందుకు నీళ్ళు లేవు. ప్రజలంతా వరుణదేవుని దయకోసం, ఆకాశంవేపు దృష్టి నిలిపి, ఎదురు చూడసాగారు.

నాగమ్మ కూచోడానికైనా ఓపిక చాలక కటికనేలమీద మేనువాల్చింది. ఒళ్ళంతా సలసల కాగిపోతుంటే, ఆమె కడుపులోని బాధను అణచుకోలేకపోయింది. బోరగిల పడుకుని, వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది. కన్నీళ్లురాని ఏడుపు. బ్రతుకు మీది కోపం రూపమెత్తిన ఏడుపు.

ఒంట్లో సత్తువలేనప్పుడు ఎంతసేపని మాత్రం ఆమె ఏడవగలదు? లేచి

కూచుని, మెల్లగా బయటకు వచ్చింది. ఉదయం పదిగంటల వేళ ఆకాశపు గద్దెనెక్కి సూర్యుడు చంద్ర నిప్పులే చెరగుతున్నాడు. నాగమ్మ రెండడుగులు ముందుకు వేసింది. గుడిసెలోంచి కుర్రవాడి ఏడుపు వినిపించింది. అడుగు ముందుకు పడలేదు. వెనుదిరిగి, తడబడుతూ కుక్కిమంచం మీద గుక్కపట్టిన పసిబిడ్డను గుండెల దగ్గరకు తీసుకుంది. పసివాడు నోరు చప్పరిస్తూ పాలకోసం ఆత్రపడసాగాడు.

"నానిగా! ఏడున్నాయిరా పాలు? వాన పడకపోతే, కూడులేకపోతే— నీ కడుపెట్టా నిండుతాదిరా" అంటూ నాగమ్మ బిడ్డడిని భుజంమీదకు తీసుకోబోయింది.

వాడికి పాలు కావాలి. జాకెట్టును పెదవులతోపట్టి లాగ నారంభించాడు. ఎంతకూ తల్లి తనను పాలు తాగనీయకపోతే, వాడు మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

"నానిగా!—ఇట్టా పోరెడితే నేనేం సేయన్రా కొడకా! మాగన్నుగా పడుకోరా! మా నాయనవిగందా! ఏడవొద్దురా!"

తల్లి మాటలు, ఆమె బాధ ఆ పసిగుడ్డుకు అర్థంకావు. వాడికి పాలు కావాలి. వెన్నెముకకు అంటుకుపోయిన కడుపులో అమృతంలాంటి తల్లిపాలు పడితేనేగాని వాడి పెదవుల మీదికి చిరునవ్వు రాదు. కడుపులో మంటను కన్నుతెరవని పసిగుడ్డు సహించలేడు. తల్లి రోజుల తరబడి నిరాహారంగానూ, కనీసం నీళ్ళు తాగకుండానూ పడి ఉంటేనేమి— వాడికి కావలసింది పాలు.

గుక్కపట్టి ఏడుస్తున్న పసివాడిని, భుజంమీదికి లాక్కుని, నాగమ్మ నడిమింటి గుంజకు వేలాడుతున్న పిడత వెదికి, అందులో మిగిలిన పది పైసల బిళ్ళనూ గుప్పిటిలోకి తీసుకుంది. ఆ గుడిసెలో, ధనరూపంగా మిగిలిన ఆస్తి ఆ పదిపైసలబిళ్ళ ఒకటే! కూలినాలి చేసుకుని, ప్రాణం నిలుపుకునేందుకు రెండుముద్దలైనా సంపాదించుకునే తెరవు ఏనాడో సన్నగిలిపోయింది. కలిగినవాళ్ళు సైతం కాటకంతో కలవర పడిపోతున్నారు. అసలు వాళ్ళ బ్రతుకులే అంతంతమాత్ర మైనపుడు, వాళ్ళపై ఆధారపడ్డ బీదప్రజల గతి యింతేను.

పదిపైసలబిళ్ళ చేతపట్టి, పాలకోసం పోరుపెడుతున్న పసివాడితో సహా నాగమ్మ వెంకటసుబ్బయ్య ఇంటివైపు నడక సాగించింది.

నాగులపాడుకు పెద్ద వ్యాపారి వెంకటసుబ్బయ్య. ఉప్పూ, చింతపండూ, పప్పుదినుసులూ కాక అతగాడు గత కొద్దిరోజులుగా మంచినీళ్ల కూడా అమ్మడం ప్రారంభించాడు

చీమలు దూరని చిట్టడివినించీ, కాకులు దూరని కారడవినించీఅమృతోపమాన మైన జలం తెప్పించానని గ్లాసు కింత చెప్పి, ప్రాణాలు నిలబెట్టుకునేందుకు ఆధారభూతమైన నీటిని అమ్ముతున్నాడు. సలిల దానం చేసినవాడు చక్కా బొందితో స్వర్గం పోతాడట! కాని, వెంకటసుబ్బయ్యే ఏ స్వర్గానికి వెడతాడో తెలియదు గాని, అతని పేరున ఎన్నో ప్రాణాలు తమ గుప్త ధనాన్ని అతనికి ధారపోస్తూ-లోప శ్లోపల నానార్థదూషణ ప్రక్రియనూ కొనసాగిస్తున్నాయి.

అతని ఇంటిముందు జనం పడిగాపులు పడివున్నారు. సింహాసనాధిష్టుడైన మహారాజు మాదిరి వెంకటసుబ్బయ్య ఎత్తైన పీటమీద కూచుని, కాసులకు నీళ్ళమ్ముతున్నాడు.

దూరంనించి నాగమ్మ నోరు చప్పరించుకుంది. తడారిపోతున్న గొంతులో అమృతధార ఒలికినట్లయింది. తడబడుతున్న అడుగులతో ఆమె ఆ జనంలో కలిసింది. అక్కడ – జనం గ్లాసులు చేతుల్లో ఉంచుకుని, వరుసలో నిలబడి ఉన్నారు. నాగమ్మ గబగబ అరుగు దగ్గరకు నడిచి, వెంకటసుబ్బయ్యవంక దీనంగా చూచింది. ఆ మహారాజు ఆమెను కీటకాన్ని చూస్తున్న పోలిక నవలోకించాడు.

"ఏం–నువ్వు రాణివా? ఛో! క్యూలో నిలబడు–" అని అరిచాడు.

నాగమ్మ భయపడింది. నేలచూపులు చూస్తూ అక్కడే నిలబడింది. క్యూ చూస్తే చాలా పొడవుగా ఉంది. అందరి వెనుకా నిలబడి, వాళ్ళందరూ గొంతు తడుపుకునేంత వరకూ తాను ఎదురు చూస్తో కూచోలేదు. అంతవరకూ ప్రాణం నిలవదన్నా ఆశ్చర్యం కాదు.

"బాబో! చచ్చి నీ కడుపున పుడతా ఈ పదిపైసలకూ రెండు చుక్కలియ్యి నాయనా!" అని అరిచింది నాగమ్మ.

ఆమె మాటలు వింటూనే వెంకటసుబ్బయ్య పకపక నవ్వాడు


"పదిపైస లేవిఁచే! పిచ్చిదానా! గళాసు పావలా! ఏవిటి? వాఁలా! తెలిసిందా!" అనేసి మళ్ళీ నవ్వాడతను.

నాగమ్మ వెర్రిదానిలా చూచింది.

"నిన్న పదిపైసలేగా ..." సణిగింది నాగమ్మ.

"నీ మొహవేంకాదూ! తేరగా వస్తయ్యనుకున్నావా! పోవేఁ – నీది నీళ్ళుకొనే మొగవేఁ..."

వెంకటసుబ్బయ్య మాటలు వింటూనే నాగమ్మ దిగాలు పడిపోయింది. తన దగ్గర ఉన్నది పదిపైసలబిళ్ళ మాత్రమే! ఒక్కగ్లాసు నీళ్ళకోసం నాలుగణాలు తా నెక్కడి నుండి తెచ్చిపెడుతుంది!!




"పోనీ బాబో ! అరగళాసుడు నీళ్ళేసి పుణ్యంకట్టుకో నాయనా!"

"అర గళాసుడు-ఇంకా నయం! రెండుపైసల నీళ్ళన్నావు కాదు. పోవే-నీ బేరం నువ్వూనూ ." అని గదిమాడు షాహుకారు.

క్యూలో నిలబడ్డవాళ్ళు కళ్లెర్రజేసి చూచారు. నాగమ్మ మరి నిలబడలేక పోయింది. భుజంమీద పాపడు బరువుగా తోచాడు. తడబడుతూనే వెంకటసుబ్బయ్య ఇంటినుంచి బయలుదేరింది. బయలుదేరబోతూ కనీసం గొంతు తడుపుకునేందుకు పనికిరాని పది పైసలబిళ్ళను ఆమె వెంకటసుబ్బయ్య ముఖాన విసిరింది.

రాజనాలుకాదు - జొన్నన్న కరువైనా నాగమ్మ దిగాలుపడలేదు. కాని, గొంతు తడుపుకునేందుకు నీటిచుక్క కరువైతే ఆమె గుబులుపడింది. తా నీటిని నడిబజారులో అమ్మజూపితే, దౌర్భాగ్యాన్ని ఏ విధంగా పిలవాలి

ఆ భుజంమీదినుండి చిన్నారిని ఈ భుజంమీదికి మార్చుకుంటూ, నాగమ్మ ఆకాశాన్ని చూచింది. తూర్పునుం తెల్లమబ్బు ఎక్కివస్తూ ఉంది. నాగమ మళ్ళీ చూచింది. గుటకలు మింగింది మబ్బులే కానరాని నింగిని తెల్లమబ్బు చూపట్టితే - నాగమ్మ గుండెల్లో ఆనందం పొంగింది. మెల్లకన్ను మా అయినా మావగానే లెఖ్ఖ.

నాగమ్మకు ఇంటికి పోయేందుకు మనసు కలుగలేదు. ఆ ఎండలో ఇంటి వెళ్ళేబదులు ఏ యింటి అరుగుపైనో ఏ చెట్టు నీడనో విశ్రమించడమే మం

కనిపించిం దామెకు. అంతవరకూ పోరుపెట్టిన పిల్లవాడు తిరిగి నిద్రకు పళ్లాడు.


కోమటివీధి వారున, రావిచెట్టు ఏడన నాగమ్మ కూచున్నది. తూర్పున తెల్లమబ్బైతే ఉన్నదిగాని, వాన పడేంతవరకూ ఆమెకు నమ్మకంలేదు. నాలుగురోజుల క్రిందట-ప్రక్క గ్రామములో - ఒక ఎద్దు పెద్ద మనిషిలా అరుస్తూపోయిందని నాగమ్మ విన్నది. అంబా!' అనడమే తప్ప 'ఆకలి' అన కము చాతకాని ఎద్దు -- నోరు తెరచి మామూలు మనుష్యుల మాదిరి మాట లాడడమా? నాగమ్మ ముందుగా నమ్మ లేక పోయింది. అయినా అందరూ ఒదేమాట చెబుతూవుంటే - కాదని ఎలా నమ్మకుండా ఉండగలదు?

"నీకు తాగడానికి నీళ్లులేవు! నా కేమి యిస్తావు? మళ్ళీ ఏడాదివరకూ నువ్వూ నేనూ యింతేరా!" అంటూ గట్టిగా అరుస్తూ ఎద్దు గ్రామమంతా తిరిగిందట! ఆ ప్రక్క ఊరుతిరిగిందట! పొకటిపడే వేళవరకూ ఇట్లా అరుస్తూ తిరుగుతూనే ఉందట! మరునాటి ఉద యానికి, పాపం! ఆ ఎద్దు ఊరి పొలి మేరను చచ్చిపడి ఉందట!

నాగమ్మ ఒక్కతేకాదు - ఊరూ గాడా అందరూ ఇది కట్టుకథ అన్నారు. క్షామాభావంచేత అల్లాడిపోతున్నది మనుష్యమాత్రులేకాదు - పశువులు కూడా! గొంతు ఎండిపోయే వేళ మనిషి "అమ్మా" అని ఏడవగలడు. నోరులేని పశువులు తమబాధ నెట్లా వ్యక్తం చేయగలుగుతాయి! కమ్మని పచ్చిగడ్డి రుచిచూచి నెలలే గడిచాయి! ఎండుగడ్డి సరేసరి!! కనీసం మంచినీ ళ్ళైనా లేకపోతే...పశువులూ శిశువు లేను. వానకోసం మనిషి ఆ కాశం వేపు చూస్తున్న మాదిరిగా పశువులు కూడా మోరలెత్తి నింగివంక చూడ సాగాయి. 'మాటలాడిన ఎద్దు నిజమే చెప్పిందేమో!' అనుకున్నది నాగమ్మ. సంవత్సరంవరకూ వర్షం పడకపోతే - నాగమ్మ అదిరిపడింది. కళ్ళల్లోకి ఎర్రజీర వచ్చింది. గుండెలు దడదడ లాడాయి. ఇప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది. మరో సంవత్సరం వరకూ నింగినించి నీటిచుక్క నేలకు రాలకపోతే - మనుషుల ప్రాణాలన్నీ గాలిలోనికి ఎగరవలసిందే!!

నాగులపాడును సదా రక్షించే గ్రామదేవతకు ఆగ్రహం వచ్చిందని నలుగురూ చెప్పగా నాగమ్మ విన్నది. గ్రామదేవతను చన్నీటస్నానమాడించి కొబ్బరికాయలు కొడితే, కుండపోతగా వర్షం కురిసేదట పూర్వం! గడ్డాలు నెరిసిన వృద్ధులు కొందరు ఈ మాట చెబితే, కుర్రకారు జనం పకపకనవ్వి గేలిచేసింది.

"చన్నీటస్నానం. కొబ్బరికాయల నైవేద్యం. ఒరె ఒరె ఒరే! కాకమ్మ




కథలివన్నీ! కొబ్బరికాయలు గ్రామ దేవత తింటుందా! అవన్నీ పూజారి పరమాయె - గుడిపూజారి పెళ్ళాం ఇంచక్కా కొబ్బరన్నమూ, కొబ్బరి పచ్చడీ చేసుకొంటుంది..." అన్నారే తప్ప, గ్రామదేవతను శాంతింప చేసేందుకు కెవ్వరూ ముందుకురాలేదు.

"మా అమ్మోరికికోపం వొచ్చింది. అందుకే వాన రాలేదు. పోనీ, కప్ప నూరేగించినా బాగుణ్ణు." అనుకుంది నాగమ్మ.

సాంప్రదాయాలన్నీ చట్టుబండలైన పిదప, వృద్ధులమాటలు చెవినిపెట్టని పెడబుద్ధులివన్నీ అని ముసలివారు స గారు. అయినా, లెక్కచేసే దెవరు

నల్లమడనించి వారానికోసారి ప్రభు త్వమువారు పీపాలతో నీళ్ళు తెప్పిం ప్రజల కందజేస్తున్నారు. వెంక సుబ్బయ్యవంటి నోరున్న పెద్దమ ష్యుల యిండ్లలో జలధారలు పుడు న్నాయో ఏమో - వాళ్ళ వర్తక సజావుగా సాగుతూనే ఉంది.

నాగమ్మ కునికిపాట్లు పడుత అనేక విధాలుగా ఆలోచించుకుంట ఉంది. మగడు బ్రతికివుండగా ఆ జీవితంలోనే నిజమైనరుచిని చూచిం

ఇప్పుడు బతకడం ఎంత దుర్భరమో గ్రహింప గలుగుతున్నది.

పసివాడు ఉలిక్కిపడ్డాడు. నాగమ్మ వాడిని జోకొట్టడానికి ప్రయత్నించింది. వాడు ఏడుపు ప్రారంభించాడు. వాడికి కనీసం యిన్ని నీళ్ళయినా పడితే...నాగమ్మ చుట్టూ చూచింది. ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి. దూరంగా ఒక పెద్ద గుంటలో ఎండ పొడ పడి మిలమిలలాడుతూ నీళ్ళు కనిపించాయి. నాగమ్మ చటుక్కున లేచింది. అడుగులు పరుగున గుంట దగ్గరకు నడిచాయి. వెర్రి ఆనందంతో ఆమె మనసు ఉప్పొంగిపోయింది. గుంట దగ్గరగా మోకాళ్లపై కూచుని, ఎడమ చేతితో కుర్రవాడిని గుండెలకు అదుముకుంటూ, కుడిచేతితో గుంటలోని నీళ్ళను అందుకోబోయింది. నీటిపైన చేరిన దోమలు కొన్ని గాలిలోకి లేచాయి. పచ్చబారిననీళ్ళలో నాగమ్మ ప్రతిబింబం వెక్కిరిస్తూ కనిపించింది

గుంటకు కొంచెందూరంలో ఎరుకల గుడిసె లున్నాయి. చేయెత్తు మనిషొకడు రెండు పందులను తోలుకుంటూ అటు వచ్చాడు. నాగమ్మను చూస్తూనే వాడికి కోపం ముంచుకు వచ్చింది.

“ఏయ్-ఎవత్తివే నువ్వు? నీ అబ్బ సొమ్మనుకున్నావా ఆ నీళ్ళు, పోవే-మా పందులకోసమని నీళ్ళు దాచుకుంటే-ఓ యబ్బో! మా లచ్చిమి మంచినీళ్ళకోస వొచ్చింది ..” అంటూ అరవసాగాడు.

మోకాళ్ళపై కూచున్న నాగమ్మ బెదిరిపోయింది. తడబడుతూ లేచి నిలబడింది. ఏం మాట్లాడాలో ఆమెకు తెలియలేదు.

“అది కాదన్నా-ఈ గుడ్డు...ఇన్ని నీళ్ళు...”


“బుద్ధిలేదూ...నీళ్లుకావాలె నీకు... ఫో.. ఫో...” అంటూ నోరు చేసుకున్నాడతను.

నాగమ్మకు నోరు లేవలేదు. మ్రాన్పడి నిలబడిపోయింది. ఎరుకలవాడి కేకలకు బెదిరిపోయిన పసిగుడ్డు “కేర్...కేర్...” మని ఏడ్వసాగాడు.

ఎంతకూ నాగమ్మ కదలకపోయేసరికి ఎరుకలవాడు కర్ర ఎత్తాడు- “పోతావా...పోవా! తల బద్దలు కొడతా...ఫో... దొంగముండా...”

నాగమ్మ వినలేకపోయింది. పసిబిడ్డకిన్ని నీళ్ళివ్వనివాడు-పందులను పెంచుతున్నాడు. నాగమ్మ కళ్ళల్లోకి రక్తమే వచ్చింది. మరి క్షణమైనా నిలబడలేక, ముందుకు నడిచింది.

పసివాడిఏడుపు ఆమెకు వినిపించడం లేదు. తను నడుస్తున్నదో లేదో ఆమెకు




తెలియదు. పైనఎండ, లోపల దాహం. నేలలోపల మిగిలిన తేమ ఇగిరి, ఆమె చుట్టూ వేడి ఆవిరి. మరి నడవలేక నిలబడిపోయి ఆమె తనచుట్టూ చూసుకుంది. చూసుకుని, ఆశ్చర్యపోయింది. ఊరి పొలిమేరలో నిలబడింది తాను.

కంటిముందు వెలవెలబోతున్న పెద్ద చెరువు. చెరువు నానుకుని బీళ్లు వారిన పొలాలు. విషాదంగా, చిన్నబోయిన మొగంతో ప్రకృతి సాక్షాత్కరించింది. చూపుకందని పచ్చదనంతో బాటుగా పసుపుపచ్చని పంట పొలాలపై కిచకిచలాడుతూ ఎగిరే పిట్టల విచిత్రధ్వనులూ చెవుల కందకుండా దూరమైపోయాయి. పరక పరుకునే పిల్లల పాటలు, పిట్టలనుతోలే పడుచ పిల్లల కీచుధ్వనులూ, మేలిమి పసుపు వన్నె బంగారంగా దృశ్యమానమయే వరిపొలం మీంచి సన్నగా యీ పాటలా - మధురంగా - చల్లగా వీ మందమారుతమూ ... అన్నీ కలల్లో కన్పించే దృశ్యాలైనాయి. తెలు రైతుబిడ్డల పగిలిన గుండెలొక్క-చో కుప్పకూలినట్లనిపించింది నాగమ్మకు.

వరగానివేపు దృక్కులు మళ్లాయి ఆ ఊళ్ళో నీళ్ళు దొరుకుతున్నాయ ఎవరో అన్నారు. నాగమ్మ కాళ్ళీడు కుంటూ వరగానికి బయలుదేరింది.

దూరంనించి ఎద్దు మాటలే లీలగ విన్పిస్తున్నా యామెకు.

"నీకు తాగడానికి నీళ్ళు లేవు. నా కేమి యిస్తావు? మళ్ళీ పడాదివరకూ పవ్వూ నేనూ ఇంతేరా..."

ఆకాశంమీద కనిపించిన తెల్లమబ్బు ఎప్పుడో మాయమైపోయింది. నాగమ్మ గుండెల్లో నిరాశ నింపుకుంది. వరగాని చేరే వేళకు సూర్యుడు కొంచెంగా నల్లబడడం ప్రారంభించాడు. వరగాని కోనూ చెరువులు ఎండిపోయాయి. ఒకచోట జనం గుమికూడి ఉంటే– నాగమ్మ ఏమిజరిగిందో చూడబో యింది. వయస్సు దాటిన వృద్ధు డొకడు నేలమీద పడి చొంగలు కారు స్తున్నాడు. అతని భార్యకాబోలు, ఆ ముసలివాని కాళ్ళపై బడి, హృదయవిదారకంగా ఏడుస్తోంది. ఎవరో పాపం! చెంబుతో నీళ్ళు తెచ్చి అతని నోట్లో పోస్తున్నారు. ముసలి వానిలో ఏ మాత్రం చలనం లేదు. చుట్టూ చేరిన ఇద్దరు పిల్లలుకూడా గోలున ఏడుస్తున్నారు. నాగమ్మ గుండె చెరువైంది. పిల్లవాడి వీపు నిమురుతూ–మెల్లగా ప్రక్కనే వున్న చెరువు దగ్గరకు నడిచింది. చెరువులో కొద్దిగా నీళ్లున్నాయి. జనం ఆత్రంగా నీళ్ళు తోడుకుని తీసుకువెడుతున్నారు.

నాగమ్మ రెండుగుక్కలు నీళ్ళు తాగింది. గుండె బరువెక్కినట్లయింది. పొరమారింది. దగ్గుతో రెండుక్షణాలు సతమతమై, తననుతాను సముదా యించుకుంది. మళ్ళీ రెండుగుక్కలు మింగింది. ప్రాణం లేచివచ్చినట్లయింది దోసెడు నీళ్ళు తీసుకుని ఆత్రంగా తాగింది. ఇంకో దోసెడు తాగింది. ప్రక్కనున్న పసివాడి నోట్లో యిన్ని నీళ్ళు పోసింది. ఎవరో ఆడమనిషి అరుస్తోంది–"ఎంతసేపమ్మా – లేలే... మేంకూడా కాసిని నీళ్లు తాగాలి..."


మరో దోసెడు నీళ్లుతాగి, కొంగుకు చేతులు తుడుచుకుని, బిడ్డ నెత్తుకుంది నాగమ్మ. జాకెట్టుకు మూతి తుడుచు కుంది

నాలుగైదు రోజులుగా నీళ్లు తాగని నాగమ్మకు ఒక్కసారి కడుపు నిండుగా తాగడంతో, వికారం బయలు దేరింది. ప్రేవులు అరుస్తున్నాయి. నీరసం క్రమ్ముకుంటూ ఉంది. కళ్లు మత్తుగా మూతలు పడుతున్నాయి. రెండడుగులు వేసి, తూలబోయి, నిల దొక్కుకుందామె.

మరి నడవలేక, ఒకచెట్టు నానుకుని కూలబడింది. గుండెలమీద కొడుకును కూచుండబెట్టుకుని, మత్తుగా నేలకు వాలింది.

జనం గోలగా అరుస్తున్నారు. నాగమ్మకు వికారం ఎక్కువైంది. అట్లా పడుకోలేకపోయింది. అతి కష్టం మీద లేచికూచుంది.

ఆకాశంనిండా నల్లమబ్బులు కమ్మి




కుంటున్నాయి. సూర్యుడు మబ్బుల వెనక పడిపోయాడు. నాగులపాడు దిశగా నల్ల మబ్బులు భీకరంగా ఉన్నాయి. నాగమ్మకు కాలు నిలవ లేదు—చివ్వున లేచి నిలబడింది. కొడుకును విసురుగా భుజంమీద వేసు కుంది. దాదాపు పరుగెత్తుతున్నట్టు, నాగులపాడువంక బయలుదేరింది.

క్రమంగా గాలివీచనారంభించింది. నల్లమబ్బులు ఆకాశంనిండా కమ్ము కుంటున్నాయి, సన్నచీకటి అలము కుంది. గాలి మేఘాల వెనకబడి తరుముతూంది. సన్నిజీవాలతో నిలబడ్డ చెట్లు గాలికి అల్లాడిపోతున్నాయి.

గాలికన్న వేగంగా నడుస్తున్నది నాగమ్మ. దూరం తరగడంలేదు. నాగులపాడులో వర్షం పడితే-నాగుల పాడు చెరువు నిండితే-నాగులపాడులో పంటపొలాల్లో అమృతమే ప్రవహిస్తే.

ఆవేశం నాగమ్మను నిలబడనీయడం లేదు. ఆయాసం అంతకంతకూ అధిక మౌతూఉంది. అయినా, మనిషి పరుగ మానలేదు వేగంగా అడుగులేస్తూనే ఉంది. కాలికింద ములుకుల్లాంటి రాళ్ల పడి నలిగిపోతున్నాయి. ధూళి పైకి లేచి — మోకాలివరకూ అలము కుంటున్నది.

గాలి వేగం హెచ్చింది. నాగమ్మక ఆయాసం ఎక్కువైంది. ఆకాశంలో మేఘాలు చెదిరిపోతున్నాయి. నాగుల పాడు దగ్గరపడుతూ ఉంది. ఆకాశం ఉరిమింది. నాగమ్మ గుండెల్లో ఆశ మెరిసింది.

నాగులపాడు సరిహద్దునుంచి చూ గ్రామంలో వర్షం కురుస్తున్నట్లుగ ఉంది. నాగమ్మకు నవ్వొచ్చింది. ఆవే పెదవులపై చిరునవ్వు విరిసి, పె దైంది. పకపక నవ్వింది నాగమ్మ.

"వాన...వాన..." అని అరిచింది, అరుస్తూనే వేగంగా పరుగెత్తడం ప్రారంభించింది. నాగమ్మ చూపుల్లో వాన పెద్దదైంది. దబదబ చినకులు పడుతున్నాయి. పరుగెత్తుతూనే, కొంగుతీసి కొడుకును కప్పింది.

నాగమ్మ గజగజ వణకింది. కుండపోతగా కురుస్తున్న వర్షంలో మనిషి నిలువెల్లా తడచినట్లు ముద్దయి వెర్రిగా అరవసాగింది.

"వాన - వాన - వాన—"

ఊరి మధ్యకు వచ్చింది నాగమ్మ. వెంకటసుబ్బయ్య యింటిముందు జనం నిలబడి ఉన్నారు. వాళ్ళని చూచి నాగమ్మ పకపకా నవ్వింది.

"ఒరి యెర్రోళ్ళలారా! వాన పడతంది! రండి-రండి! వాన ఒహో ... వాన..."

చిన్నపిల్లలు సన్నచినుకుల్లో వాన పడుతూంటే 'వానాలప్పా' తిరుగుతున్నట్టుగా నాగమ్మ గిర్రున తిరగసాగింది. కొడుకు గోలున ఏడుస్తున్నాడు. నాగమ్మ చిన్నపిల్లలా, పెద్దగొంతుతో పాడ ప్రారంభించింది.

వాన అంత కంతకూ ఎక్కువైపోయినట్లుగా అనిపించిందామెకు.

"భలే-భలే-గొప్పవర్షం! నాగుల పాడుకు వరదరావాలి. గంగమ్మతల్లీ! మా మీద దయ వొచ్చిందా...శివుడి నెత్తిమీదనుంచిఉరుకుతున్నమాయమ్మా రావే! మా చేలు మళ్ళీ పచ్చగా ఆనాలి. మా కడుపులు నిండాలి..."

వానాలప్ప తిరుగుతూ నాగమ్మా నోరువిప్పి వాననీటికోసం నాలిక ముందుకు చాపింది. తిరిగీ నాలికని లోపలకు తీసుకుని గుటకలు మిగింది. అందంగా - కొత్తగా - అందరికీ వినిపించేలా - యించక్కా నవ్వింది.

"ఒలమ్మో! ఇదేం వర్షమే - నా మోకాళ్లు మునిగిపోయాయి.అయ్యో! ఇ దెక్కడి నీరమ్మో! - ఎక్కువైపోతోంది రోయ్ - ..."

గాలి ఉధృతానికి ఆకాశాన్ని పరచుకున్న మేఘాలు చెదరిపోయాయి. గాలి క్రమంగా తగ్గసాగింది. వెంకటసుబ్బయ్య ఇంటిముందు జనం ప్రాణ్పడి నిలుచుండిపోయారు ఒక్కరి నోటివెంట మాటలేదు.

ఉన్నట్టుండి నాగమ్మ కుప్పగా కూలిపోయింది. పిల్లవాడు గోలగా ఏడుస్తున్నాడు. జనం నాగమ్మ దగ్గరకు పరుగుపెట్టారు. ఆమె రెండు కళ్ళనించీ రెండుకన్నీటిబొట్లు జారినట్టుగా చారలు కన్పిస్తున్నాయి.

విపరీతమైన గాలితాకిడికి మేఘాలన్నీ ఏమూల కొదిగిపోయాయో తెలియవు. నాగమ్మమీద జాలితలచి ఆకాశం ఒక్క కన్నీటి బొట్టైనా రాల్చిందికాదు.